మనసారా ప్రేమించిన బావని ఆమె ఎందుకు దూరం చేసుకుంది?

# ప్రేమించకే మనసా

సామర్ల లక్ష్మీరాజ్ కథ

బావ అంటే నాకిష్టం!

మరీ మరీ ఇష్టం!!

అప్పుడెప్పుడో... చిన్నప్పుడు...

ఏలూరులో నాన్నమ్మ దగ్గరకు వచ్చేవాడు. సంకురాతిరి సెలవులకు, వేసవి సెలవులకు విడిదిల్లు మా ఇల్లే!

మా నాన్నమ్మ బావకు అమ్మమ్మకదా...

నాకు స్వయానా మేనత్త కొడుకు...

అందుకేనేమో వస్తూనే దర్జా వెలగబెట్టేవాడు.

''ఏయ్ కమ్లీ ఇలా రా!!'' దర్పంగా పిలిచేవాడు.

''ఇదిగో బావా! నా పేరు కోమలి! అలా కమ్లీ అని పిలవద్దని ఎన్నిసార్లు చెప్పాలి?'' ఎదురు దెబ్బలాడేదాన్ని.

ఓహ్ అంతలోనే కోపాలు అలకలు అన్నీ మర్చిపోయి ఆడుకునేవాళ్లం!

చిన్నపిల్లలంకదా!

కల్మషం ఎరుగని వయసాయె!

పగలంతా ఆడి ఆడి అలసిపోయి రాత్రి వెన్నెట్లో ఆదమరచి నిద్రోయేవాళ్లం! నా మీద కాలు, చెయ్యి వేసి మరీ పడుకునేవాడు బావ! ఆ సాన్నిహిత్యం, అల్లరి చేష్టలు, కోపాలు, అలకలు, ఆ స్నేహం నా పసి మనసులో చెరగని ముద్రలేశాయి!

అలా ఎన్ని వేసవులు గడిచాయో గుర్తులేదు! హఠాత్తుగా బావ రావడం మానేశాడు. నాకు గొప్ప దిగులేసింది.

రోజూ బావకోసం వీధి చివరికెళ్లి ఎదురుచూసేదాన్ని! ఎక్కడా బావ వస్తోన్న జాడే లేదు!

ఓరోజు ఉండబట్టలేక అమ్మని అడిగేశాను. అసలు కారణం అప్పుడు చెప్పింది. అత్తయ్యవాళ్లకు అంతస్తు పెరిగిందట! బావని డార్జిలింగ్ స్కూల్లో వేశారట! ఇహ సెలవులకు ఊటీలు, కాశ్మీరులే



తారట! ఇక్కడికి రాడట!

అంతే! నాలో చెప్పలేనంత గుబులు!

ఏదో తెలియని భయం! ప్రియనేస్తం లెప్పటికీ కనిపించడా? అంతస్థులు పెరిగితే దూరాలు పెరిగిపోతాయా? బంధుత్వాలు, అనుబంధాలు తరిగిపోతాయా?

ఏమో నా చిన్ని బుర్రకు అవన్నీ అర్థంకాలేదు.

ఆ తరువాత నాన్న ఉద్యోగరీత్యా మేమూ

హైదరాబాదుకొచ్చేశాము.

★ ★ ★

ఆరోజు -

కాలేజీనుండి ఇంటికొచ్చేసరికి ఇల్లండా సందడి సందడిగా వుంది.

డ్రాయింగ్ రూమ్‌లోకి అడుగు పెట్టానో లేదో ఓ కొత్త వ్యక్తి దర్శనమిచ్చేడు. యువకుడే. ఇంపోర్టెడ్ బట్టల్లో మెరిసిపోతున్నాడు. నన్నుచూసి కళ్లెగరేశాడు. ఓ నవ్వు విసిరాడు. చెప్పొద్దూ! భలే చిరాకేసింది.

తిన్నగా వంటింట్లోకి నడిచాను. అక్కడ అమ్మ, నానమ్మ, ఓ లావాటి ఆవిడతో మాట్లాడుతున్నారు. కిచెన్లో కుర్చీ వేసి మరీ అతిథి మర్యాదలు చేస్తున్నారు.

నన్ను చూస్తూనే ''రావే! కోమలీ... ఎవరో కాదు! మీ మేనత్తే'' అని కూతుర్ని మురిపంగా చూస్తూ అంది నానమ్మ.

నాకు చాలా చిత్రంగా అనిపించింది పాత బంధుత్వాన్ని కొత్తగా పరిచయాలు చేసుకోవడం!

''అబ్బో చాలా ఎదిగిందే! మంచి రంగూ అదీ వచ్చింది'' అంటూ ఓ నవ్వు నవ్వింది అత్తయ్య.

అసలా మనిషిలో ఎంత వెదికినా అత్తయ్య పోలికలే కనిపించడంలేదు. ఒళ్లంతా ఖరీదైన వస్తువులతో నిండిపోయింది. ఆ కూర్చోవడం, మాట్లాడం, తల ఆడించడం, చిన్నగా నవ్వడం, అంతా కొత్త పద్ధతిలో సాగిపోతున్నాయి!

''ఇదిగో! హాల్లో మీ బావ వున్నాడు! ఈ టిఫిన్ తీసుకెళ్లి ఇచ్చిరా'' ఆ మాటలు అమృతపు జల్లుల్లా సోకాయి నాకు.

ఆ వ్యక్తి... బావ!

వచ్చింది బావ!

నా చిన్ననాటి నేస్తం!

అంతే! మనసు మబ్బు పింజెల్లో తేలిపోతుంటే కాళ్లు నేలమీద ఆనడానికి ఇబ్బంది పడుతున్నాయి.

''తీసుకో బావా!'' అందించాను.

''హాయ్ కమ్లీ... నేను గుర్తున్నానా? ఇందాక నవ్విస్తే అలా మొహం చిట్లించుకుని వెళ్లిపోయావు?? నన్ను మర్చిపోయావా?'' నా చేతులు పట్టుకుని ఊపేస్తూ ఉత్సాహంగా బావ అడుగుతున్నాడు.

''మర్చిపోవడమా? నిన్ను తలవని రోజు లేదని నీకెలా చెప్పాలి. ప్రియంతమా నా మనసు మాట్లాడుతోంది. జీవితంలో తొలిసారి పరపురుషుడి స్పర్శ... శరీరమంతా సన్నని ప్రకంపన... మనసులో మధుర భావనలు కురిపిస్తూ...

గుండెలో నిక్షిప్తమైన ఆనాటి జ్ఞాపకాలను, అనుభూతులను బావ ఏకరువు పెడుతుంటే నేను మూగబోయాను... ఆశ్చర్యంతో... ఆనందంతో!

బావ ఏమీ మారలేదు! అదే మాట తీరు... అదే మనసు... కానీ వయసే?!

ఆ వయసే నన్ను బావపైన మనసు పడేలా చేసిందీ!!

★ ★ ★

అది మొదలు...

రోజూ బావ రావడం... కబుర్లు... షికార్లు... సినిమాలు... చాలా త్వరత్వరగా రోజులు గడిచిపోతున్నాయి.

నా మనసులో బావరూపం ప్రేమ కుంచెలతో రంగు దిద్దుకుంటోంది.

ఓ రోజు సాయంత్రం ట్యాంక్ బండ్ దగ్గర అస్తమిస్తున్న సూర్యకిరణాల తళుకులను నీటిపై చూస్తున్న బావతో...

''బావా!'' మృదువుగా పిలిచాను.

''ఊ'' అన్నాడు నావైపు చూడకనే..

''మనం పెళ్లెప్పుడు చేసుకుందాం?'' చిరుసిగ్గులొలకబోస్తోన్న నాతో...

''పెళ్లా? ఎవరికి?'' అడిగాడు వినిపించనట్టు...

ఉలిక్కిపడ్డాను! ''మనకే! నీకూ... నాకూ!''

ఆతృత ధ్వనిస్తోంది నా గొంతులో...

గట్టిగా నవ్వేశాడు ''డోంట్ బీ సిల్లీ! మనిద్దరికీ పెళ్లేమిటి?'' చాలా మామూలుగా అడిగేసరికి...

నిర్ఘాంతపోయాను! విస్తుపోయి చూస్తూ ''అదేమిటి? అలా మాట్లాడతావు? కలిసి తిరిగాం. కబుర్లాడుకున్నాము. ప్రేమించుకున్నాం. ఇప్పుడు పెళ్లిచేసుకుందామంటే అలా ఎక్స్‌పెక్టెడ్‌గా మాట్లాడతావేంటి? జోకా..?'' తీవ్రంగా చూస్తూ సూటిగా నిలేసేసరికి...

''ప్రేమించుకున్నామా? అసలు నిన్ను ప్రేమిస్తున్నానని ఎప్పుడైనా చెప్పానా? అసలు నాకా ఉద్దేశ్యమే లేదు. ఏదో చిన్ననాటి ఫ్రెండ్‌వని సరదాగా, చనువుగా వున్నంత మాత్రాన, నువ్వేదో ఊహించేసుకుని నా మీద విరుచుకుపడతావేమిటి?'' చిరాగ్గా అడిగేసరికి...

బిత్తరపోయాను! అవును నిజమే! బావ. ఎప్పుడూ నన్ను ప్రేమిస్తున్నట్లు చెప్పలేదు. నేనే అతన్ని ప్రేమించాను. భర్తగా అతన్ని ఊహించుకున్నాను! కానీ ఆ ఫీలింగ్స్ ఏవీ అతన్లో లేవుట!

కేవలం స్నేహమట!!

స్త్రీ పురుషుల మధ్య స్నేహం, ఆకర్షణ, ప్రేమ... ఎట్సెట్రాలు వేరువేరుగా వుంటాయని తెలుసుకోలేని మూర్ఖురాల్ని!

నన్ను నేనే నిందించుకున్నాను!

కోపం... ఆవేశం... నిస్సహాయత... నిర్లిప్తత దుఃఖం... ఇవేవీ నేను అనుభవించలేదు.

అన్నిటికి అతీతమైన ఓ అభావం!

అంతటా శూన్యం!!

చిత్రంగా నా మనసు బావని ద్వేషించలేదు! అంతకంటే విచిత్రంగా నేను కుప్పకూలి పోలేదు.

కొన్ని గాయాలు కాలంతోపాటు కలిసిపోతే... మరికొన్ని గాయాలను కాలం మోసుకొస్తుంది.

అదేనేమో జీవితం!

★ ★ ★

ఆ తరువాత బావ పెళ్లి శుభలేఖ వచ్చినా పెళ్లికి వెళ్లలేకపోయాను. సివిల్ సర్వీసెస్ ప్రిపరేషన్లో మునిగిపోయి వున్నాను. నా పెళ్లి ప్రసక్తే ఎత్తనివ్వలేదు ఇంట్లో! బావ కబుర్లూ తెలీలేదు నాకు... నా విధి

## బోర్

''రాధా హనీమూన్‌కి వెళ్దామా''

''వద్దు విజయ్ ఇప్పటికి నాలుగుసార్లు వెళ్లాను. మళ్లీ మళ్లీ వెళ్తే చచ్చేంత బోర్'' అంది రాధ.

- జె.సాంబయ్య (ఖమ్మం)



నిర్వహణలో నేను!!

ఇదిగో ఇన్నేళ్ల తరువాత-

ట్రాన్స్‌ఫర్‌మీద ఈ ఊరు వచ్చేను.

ఒకరోజు అమ్మ ''ఏమే! మీ బావ పెళ్లాం పోయిందట! ఏదో పెద్ద జబ్బే వచ్చిందట!! రాదూ మరీ... నిన్ను కాదని మరోదాన్ని పెళ్లాడాడుగా? తగిన శాస్తే జరిగిందిలే!'' ఈసడింపుగా అంది.

ఆ వార్తకు నా హృదయం విలవిల్లాడింది. ఆవేదనతో మనసు అస్థిమితమైంది. వెళ్లి పలకరించాలని, ఓదార్చాలని బలీయంగా అన్పించినా... బావని ఆ స్థితిలో చూడలేక నిగ్రహంగా వుండిపోయాను.

★ ★ ★

ఆరోజు-

''ఎవరో మిమ్మల్ని అర్జంటుగా కలవాలని వచ్చారమ్మా!'' ప్యూన్ మాటలకు

''పంపించు!'' అన్నాను.

తలుపు తీసుకుని వచ్చిన వ్యక్తిని చూస్తూనే ఆశ్చర్యపోయాను.

బావ!

ఎట్ట ఎదురుగా బా...వ!!

బాగా కృంగిపోయి... పదేళ్ల వయసు మీదపడినవాడిలా నిర్లిప్తంగా నిల్చున్న అతన్ని చూస్తూనే గుండె కలుక్కుమంది. హృదయం ఆర్తిగా అతన్ని ఓదార్చాలని తపిస్తోంది... కానీ నిశ్చలంగా నేను...

''అయామ్ సారీ!'' అన్నాను పరామర్శిస్తూ...

మౌనం కొద్దిసేపు.

ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ ''కోమలీ! నాకో వరమిస్తావా?'' ఆశగా అడిగాడు.

''ఏమిటి?'' ఆశ్చర్యంతో నేను.

''నాతో జీవితం పంచుకుంటావా?'' చాలా నెమ్మదిగా ఎద లోతులనుండి వస్తోన్న ఆ మాటలకు...

వెర్రిగా ప్రేమించిన మనసు నిగ్రహం కోల్పోయి నీరుగారుతోంది.

కానీ - వివేకం వెన్నుతట్టింది. చివుక్కున తలెత్తి సూటిగా చూశాను. ''పంచుకోవడానికి తుంచుకోవడానికి జీవితం మన చేతుల్లో వుందా బావా?! ఆనాడు నా ప్రేమను కాదన్నావు! అయినా బాధపడలేదు! కానీ - ఇప్పుడు వ్యథగా వుంది నాకు- నీ అవసరం కోసం నా చెంతకొచ్చావు. నిన్ను ఓదార్చి లాలించే స్నేహితురాలు కావాలి. అవసరాలు తీర్చే తల్లి కావాలి. ఆర్తిగా ఆదరించే ఓ మనిషి కావాలి. శారీరక వాంఛలు తీర్చేందుకు ఓ ఆడది కావాలి. వీటన్నిటిని సమర్థంగా నిర్వర్తించేది స్త్రీ! నిస్సందేహంగా అది భార్య అయి తీరుతుంది. అందుకే భార్య 'అన్న పదవితో నాకు ఎరవేయడానికొచ్చావు! అంతేగా'' నిప్పులు చెరుగుతున్న నా వాగ్ధాటికి-

విలవిల్లాడిపోతూ... ఆశ్చర్యంగా చూశాడు.

''లేదు! లేదు! నన్ను అపార్థం చేసుకోకు.

నీ ప్రేమను దూరం చేసుకుని నేనేం కోల్పోయానో నాకు తెలిసింది. మనల్ని ప్రేమించే మనుషులు దొరకడం అదృష్టం! ఆ అదృష్టాన్ని నా స్వంతం కమ్మని అభ్యర్థిస్తున్నాను. నీ సహచర్యానికై తపిస్తోన్న నన్ను కరుణించు కోమలీ'' ప్రాధేయపడుతున్న బావ రూపం నన్ను కరిగించలేదు.

''క్షమించు బావా! నన్ను ప్రేమించే వ్యక్తి నాకోసం ఎదురుచూస్తుండగా నిన్ను చేసుకుని నేను బావుకునేదేమిటి? మరి కొద్దిరోజుల్లో అతనికి స్వంతమయ్యే నన్ను నువ్విలా అడగడం సభ్యతగా లేదు'' ముగించాను.

చిధ్రమైన మనసుతో చూస్తూ ''అయ్ విష్ యూ ఏ హేపీ మ్యారీడ్ లైఫ్'' అని నిరాశగా

వెళ్లిపోయాడు.

ఆ అడుగుల చప్పుడు దూరమవుతూనే...

అప్పుడు బద్దలయింది దుఃఖం...

''బావా ప్రేమించే మనసెప్పుడూ ద్వేషించదు. వధువుగా నీ ముంగిట్లో అడుగిడకనుందే దురదృష్టం నన్ను వెంటాడుతోంది. నీ మాటే వేదంగా భావించే నేను నీకు వేదనను మిగల్చలేను. శిశిరం తరువాత ప్రకృతి పల్లవించాలి. అది ధర్మం! కానీ నా జీవితంలో మధుమాసమే లేదు! రాదుకూడా... అందుకే అంత కటువుగా నీ గుండెనుకోశాను ప్రియతమా...'' నా మనసు రోదిస్తోంది.

వెక్కి వెక్కిపడుతున్న కన్నీళ్లను కప్పేస్తూ... తెరలు తెరలుగా దగ్గు నన్ను కమ్మేస్తూ... పెదవి చివర చిక్కటి ద్రవం పుష్కు పుష్కుగా తగులుతూ... అది రక్తమని నాకు తెలుసు!.

విధి నన్ను చూసి పరిహసిస్తోంటే...

మృత్యువు ఆప్యాయంగా ఆహ్వానిస్తోంది!!

*

